జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 26-12-2024 | ఎడిటర్: చౌదరి ప్రమోద్ కుమార్ | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 202 పేజీలు: 4 వెల : రూ.7



* పండగ నేపథ్యంలో ఎక్కడికక్కడ నిర్వాహకుల ఏర్పాట్లు * గుట్టుచప్పుడు కాకుండా శిబిరాల నిర్వహణ * అనుచరులను కాపలాగా ఉంచి పేకాట ఆడిస్తున్న నిర్వాహకులు * ఈ రెండు రోజుల్లో 21 మందిని పట్టుకున్న పోలీసులు

# జోరుగా పేకాట..

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 25(వార్త):** జిల్లాలో జోరుగా పేకాట శిబిరాలు వెలుస్తున్నాయి. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని తోటల్లోనే కాకుండా జిల్లా కేంద్రంలోని పలుచోట్ల రహస్యంగా పేకాటను నిర్వాహకులు ఆడిస్తున్నారు. అనుచరులను కాపలాగా ఉంచి ఎవరికీ అనుమానం రాకుండా పేకాటను ఆడిస్తూ కాసులు చేసుకుంటున్నారు. పేకాట ఆడేవారికి అన్ని హంగులు, ఆర్భాటాలు కల్పిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా జోరుగా ఈ దందాను కొనసాగిస్తూ కాసులు కూడబెట్టుకుంటున్నారు. కొత్త వ్యక్తులను దరిదాపుల్లోకి రానీయడం లేదు. అందరినీ మేనేజ్ చేస్తూ పేకాట ఆడిస్తున్నారు. పండగ సమయం కావడంతో పెద్ద ఎత్తున పేకాట శిబిరాలు ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొందరు పోలీసులకు మామూళ్లు ఇస్తున్నామని.. ఎవరూ దాడులు చేయరని.. పేకాట ఆడేవారికి నిర్వాహకులు అభయమిస్తూ మరీ రప్పించుకుంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ రెండు రోజుల్లోనే జి.సిగడాం, శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో 21 మంది పేకాటరాయుళ్లను పోలీసులు పట్టుకున్నారు. శ్రీకాకుళంలోని ఆదివారంపేట సమీపంలో మంగళవారం రాత్రి ఆరుగురు పేకాట ఆడుతుండగా రెండో పట్టణ పోలీసులు దాడులు నిర్వహించారు. పట్టుబడిన వారి నుంచి రూ.9680 నగదు, మూడు బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేశారు. అలాగే జి.సిగడాం మండలంలోని వాండ్రంగి పంచాయతీ పరిధి చీడిపేట పాత బస్టాండ్ వద్ద పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 15మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వై.మధుసూదన రావు తెలిపారు. జి.సిగడాం మండలంలోని మెట్టవలస, పొందూ రు, రాపాక గ్రామాలకు చెందిన 15 మంది నుంచి రూ.1,39,180 నగదు, 15 సెల్ ఫోన్లు, రెండు కార్లు, 11 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇకనైనా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఈ పేకాట నిర్వాహకులపై ఉక్కుపాదం మోపాలని జిల్లావాసులు కోరుతున్నారు.

## వైద్యుల నిర్లక్ష్యం..




# నిండు ప్రాణం బలి

* టెక్కలి జిల్లా ఆసుపత్రిలో శిశువు మృతి
* వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంపై బంధువుల ఆగ్రహం
* చర్యలు తీసుకోవాలంటూ ఆసుపత్రి ముందు ధర్నా
* ఆసుపత్రి వైద్యులను నిలదీసిన బీజేపీ నేతలు
* జిల్లా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది మారదంటూ సర్వత్రా విమర్శలు * మంత్రి అచ్చెన్నాయుడు దృష్టి సారించాలని వేడుకోలు

**టెక్కలి, డిసెంబర్ 25 (వార్త):** ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం.. సకాలంలో డెలివరీ చేయకపోవడంతో.. పండంటి మగ బిడ్డ మృతి చెందాడంటూ బంధువుల ఆందోళనలతో టెక్కలి జిల్లా ఆసుపత్రి అట్టుడుకింది. నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ కుటుంబ సభ్యులు ధర్నా చేయగా ఆసుపత్రి వైద్యులను బీజేపీ నేతలు నిలదీశారు ఆసుపత్రి వైద్యుల తీరుపై మరోసారి విమర్శలు వర్షం కురుస్తోంది. మంత్రి అచ్చెన్నాయుడు దృష్టి పెట్టి ఈ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పనితీరు మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే.. నందిగాం మండలం కైజోల గ్రామానికి చెందిన శ్రావణి డెలివరీకి మంగళవారం టెక్కలి జిల్లా ఆసుపత్రిలో పురిటి నొప్పులతో చేరారు. రాత్రి సమయంలో పురిటినొప్పులు అధికం కావడంతో స్థానిక సిబ్బందికి డెలివరీ చేయాలంటూ కుటుంబీకులు వేడుకున్నారు. సిబ్బంది మాత్రం వైద్యులు వస్తారని చెప్పి కాలయాపన చేశారు. వైద్యులు రాత్రివేళ రాలేదు. బుధవారం ఉదయం ఆ గర్భిణీకి ప్రసవం చేయగా, మగబిడ్డ పుట్టింది. కొద్ది సేపు తర్వాత ఆ బిడ్డ మృతి చెందాడు. శిశువు మృతికి ఆసుపత్రి సిబ్బంది, వైద్యుల నిర్లక్ష్యం కారణమని బంధువులు ఆరోపిస్తు ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి నుండి వైద్యులకు ఫోన్ చేస్తున్నామని తెల్లవారి ఆరు గంటలకు వచ్చి వైద్య సేవలు అందజేశారని కుటుంబీకులు ఆరోపించారు. దీనిపై న్యాయం చేయాలంటూ జిల్లా ఆస్పత్రి ముందు బంధువులు ధర్నా చేశారు. అయితే గర్భిణికి సకాలంలో వైద్యం అందించి చికిత్స అందించినప్పటికీ ఆపరేషన్ చేసే అవకాశం లేక సాధారణ కాన్పు ద్వారా బిడ్డను బయటకు తీశామని వైద్యులు చెబుతున్నారు. అప్పటికే పేగులు మెడకు చుట్టుకుని అస్వస్థతకు గురై శిశువు మృతిచెందినట్లు వెల్లడించారు. ఏది ఏమైనా ఆసుపత్రిలో ఇలాంటి సంఘటన జరగడంతో స్థానిక బిజెపి నేత లింగరాజు డాక్టర్లు తీరుపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఇలా ఎంతమంది కడుపుకోతకు కారణం అవుతారంటూ నిలదీశారు. ఏది ఏమైనా ఈ సంఘటనపై జిల్లా ఉన్నతాధికారులు పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.







# అంబరాన క్రిస్మస్ సంబరాలు

* జిల్లావ్యాప్తంగా చర్చిల్లో ప్రార్థనలు
* లోకరక్షకుడికి స్వాగతమంటూ క్యాండిల్స్‌తో ఆహ్వానం
* కిటకిటలాడిన చర్చిలు, ప్రార్థనామందిరాలు
* అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

**శ్రీకాకుళం, డిసెంబర్ 25 (వార్త):** లోకరక్షకుడు ఆగమన వేళ జిల్లాలో సంబరాలు అంబరాన్నంటాయి. శ్రీకాకుళం వ్యాప్తంగా క్రైస్తవ ఆరాధకులు పండుగ చేసుకున్నారు. క్రీస్తు ఆవిర్భవాన్ని స్మరిస్తూ క్రైస్తవ ప్రార్థనా మందిరాలు, చర్చిలు, ఆరాధకుల ఇళ్లు సందడిగా మారింది. మంగళవారం అర్ధరాత్రి ప్రారంభమైన క్రిస్మస్ వేడుకలు బుధవారం కూడా అంబరాన్నంటాయి. శ్రీకాకుళం నగరంలో క్రైస్తవ ఆరాధన ఆలయాలు శోభాయమానంగా దర్శనమిచ్చాయి. టౌన్‌హాల్ చర్చి, సహాయ మాత చర్చి, కీస్టోర్ చర్చిలో ప్రసంగాలు, ప్రార్థనలు నిర్వహించారు. వర్షిప్ చర్చిలో జోసెఫ్ డేనియల్ గోడి ఆధ్వర్యంలో యేసు పుట్టుక ప్రవచనాలు, క్యాండిల్ సర్వీస్‌లో ప్రసంగిస్తూ ఏసుక్రీస్తు లోక రక్షకుడని, ప్రపంచానికి దారిచూపే దయామయుడని అన్నారు. నిస్సిగోడి, విజయరత్నం ఆధ్వర్యంలో మ్యూజికల్ క్రిస్మస్ నిర్వహించారు. చిన్నారులు పాటలు పాడుతూ, నృత్యాలు నిర్వహించారు. వర్షిప్ చర్చిలో జోసెఫ్ డేనియల్ గోడి, చిన బజారులోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ డి.ఎల్.కుమార్ ఆధ్వర్యంలో, డగ్లస్ స్కూల్ కీస్టోన్ చర్చిలో ఏసుక్రీస్తు పుట్టుకపై ప్రవచనాలు, యువతీ, యువకులచే ప్రార్థనలు, గీతాల ఆలాపన, చిన్నారులచే నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలు చర్చిల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని క్రీస్తు సందేశాలను ఇచ్చారు. క్యాండిల్ సర్వీసులు, కేక్ కటింగ్‌లతో సంబరాలు జరిగాయి.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఉద్దానంలో ఎయిర్‌పోర్ట్ వద్దు

**మందస, డిసెంబర్ 25 (వార్త):** పచ్చటి ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మించవద్దని, రైతులకు తోటలే ముద్దని డా.వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డ్ మెంబర్ బత్తిని లక్ష్మణ్ అన్నారు. బుధవారం ఆయన హరిపురంలో విలేకరులతో మాట్లాడారు. ఉద్దానంలో ఏళ్ల తరబడి కొబ్బరి, జీడి, పనస, మునగ, మామిడి తదితర పంటలపై ఆధారపడి జీవిస్తున్న రైతుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోలేకపోవడం చాలా బాధాకరమన్నారు. కనీస స్పందన లేకపోవడంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో రోడ్ల అభివృద్ధికి కూడా రైతులు భూములు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కమిటీ తీసుకున్న ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసే దిశగా బాధిత రైతులు అడుగులు ముందుకు వేయాలని లక్ష్మణ్ పిలుపునిచ్చారు.



# నేనున్నానని..!

- అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే శంకర్ బాసట
- రూ.10వేల ఆర్థికసాయం
- నిత్యావసరాలు, దుస్తులు అందజేత

**శ్రీకాకుళం, డిసెంబర్ 25 (వార్త):** అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే గొండు శంకర్ అండగా నిలిచారు. శ్రీకాకుళంలోని దమ్మల వీధిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడిన ఫాతిమా బేగం కుటుంబ సభ్యులను బుధవారం ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. ఫాతిమా బేగం ఫుట్‌పాత్‌లపై బొమ్మలను విక్రయిస్తూ జీవిస్తోంది. ఈ అగ్ని ప్రమాదంలో రూ.రెండు లక్షల విలువచేసే బొమ్మలు, లక్ష నగదు, ఇతర గృహోపకరణాలు, దుస్తులు సర్వం అగ్నిలో కాలిపోయి బూడిదైపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకర్ తక్షణమే స్పందించి ఆ కుటుంబానికి తన వంతుగా రూ.10,000లతో పాటు నెల రోజులకు సరిపడే నిత్యావసర సరుకులను, దుస్తులను అందజేశారు. స్థానిక తహసీల్దార్‌కు ఫోన్‌లో మాట్లాడి తక్షణమే ఆర్థిక సహాయం అందించేలా చర్యలు చేపట్టారు. తహసీల్దార్ స్పందించి రూ. 10,000 ఆ కుటుంబానికి అందజేశారు. త్వరలోనే ఆ కుటుంబానికి ప్రభుత్వపరంగా రావాల్సిన సౌకర్యాలు అందేలా చూస్తానని హామీని ఇచ్చారు. మానవత్వంతో స్పందించి తక్షణ సహాయాన్ని అందించిన ఎమ్మెల్యే శంకర్‌కు స్థానికులు, బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే కోండ్రు

**రాజాం, డిసెంబర్ 25 (వార్త):** వర్షాల ప్రభావంతో రాజాం మండల పరిధిలోని ఒమ్మి గ్రామంలో పూర్తిగా నష్టపోయిన పెసర, మినుముల పంట పొలాలను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారం పరిశీలించారు. నష్టపోయిన రైతాంగానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పంట నష్టంపై నివేదికను త్వరితగతిన అందజేయాలని అధికారులకు సూచించారు. ఈ నివేదికను మంత్రి అచ్చెన్నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టిలో పెట్టి రైతులకు అన్ని విధాలా న్యాయం చేస్తామన్నారు.

## 'జై భీమ్' దినోత్సవ కరపత్రాల ఆవిష్కరణ



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 25 (వార్త):** జై భీమ్‌సేన ఆవిర్భావ దినోత్సవ ఆహ్వాన కరపత్రాన్ని ఆ సంఘ అసోసియేట్ అధ్యక్షుడు చల్ల దేవరాజు బుధవారం ఇచ్ఛాపురంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైభీమ్‌సేన అంబేద్కర్ ఆలోచన, ఆశయాల కోసం పని చేస్తుందన్నారు. ఈ నెల 29న సోంపేటలోని జై భీమ్ సేన కార్యాలయంలో ద్వితీయ ఆవిర్భావ దినోత్సవం జరుపుతామని తెలిపారు. దీనికి ప్రజాకవి జయరాజ్, దిగంబర కాంబ్లే హాజరవుతారన్నారు. మహిళలు, అంబేద్కర్ వాదులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బుస్క ఈశ్వరరావు, ఎన్.బాబూరావు, ఉర్జన దేవరాజు, పీసా లోహిదాస్, దడ్డ శ్యామ్, ధర్మ, డొప్ప వెంకట్రావు, మహిళలు పాల్గొన్నారు.

# సమ్మె హామీలను తక్షణమే నెరవేర్చాలి

-అంగన్‌వాడీల డిమాండ్




**శ్రీకాకుళం, డిసెంబర్ 25 (వార్త):** సమ్మె ఒప్పందంలో అంగీకరించిన అంశాలను అమలుచేయాలని, అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ డిమాండ్ చేశారు. ఆ సంఘ జిల్లా సమావేశం శ్రీకాకుళంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలుచేయాలని, అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. సెంటర్ నిర్వహణకు బిల్లులు, అద్దెలు నెల నెలా చెల్లించడం లేదన్నారు. దీంతో సెంటర్ నిర్వహణకు అప్పులు చేయాల్సి వస్తోందని వాపోయారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారని, కానీ ఏడు నెలలవుతున్నా నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన మార్గదర్శకాలు రూపొందించి అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు పి.లత, కె.సుజాత, వి.హేమలత పాల్గొన్నారు.

## ఆయన నేత్రాలు సజీవం



**శ్రీకాకుళం, డిసెంబర్ 25 (వార్త):** పొందూరు మండలం, బొడ్డేపల్లి గ్రామస్థుడు బొడ్డేపల్లి రాములు నేత్ర దానం చేసి సజీవంగా నిలిచారు. బుధవారం ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పూతి సుజాత, సహాయకుడు నంది ఉమ శంకర్ ఆయన కార్నియా సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సెక్రటరీ మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గా శ్రీనివాస్, ఇతర సభ్యులు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునే వారు 7842699321 నంబరును సంప్రదించాలని సూచించారు.

# వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

- కుంటికోట కె.నారాయణ యాజమాన్యం వినూత్న ఆలోచన
- క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన



**మందస, డిసెంబర్ 25 (వార్త):** విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహనకు కుంటికోటలోని కె.నారాయణ పాఠశాల ముందుకు వచ్చింది. క్షేత్రస్థాయికి విద్యార్థులను తీసుకెళ్లి, రైతుల పంటలు పండించే పద్ధతిని చూపించారు. పాఠశాల కరస్పాండెంట్ గుంట రోహిణీశంకర్, డైరెక్టర్స్ బుద్ధ సూర్య, అరవింద్ నారాయణన్‌తో కూడిన ఉపాధ్యాయ బృందం పొలాలు దున్నడం, నారు పోయడం, విత్తనాలు వేయడం నుంచి కోతలు, కూరగాయలు పండించడం, ప్రకృతి వ్యవసాయం ఎలా చేస్తారో విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ పంట పొలాలను ఆసక్తిగా తిలకించి, సందేహాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బడె జయంతి, బడె జ్యోతి, వజ్జ సుహాసిని, గార శంకర్ పాల్గొన్నారు.

## లారీ నుంచి జారిపడ్డ మద్యం సీసాలు

**పలాస, డిసెంబర్ 25 (వార్త):** పలాస జాతీయ రహదారిపై మద్యం లోడుతో వెళ్తున్న లారీ నుంచి కొత్త పారసాంబ వద్ద మందు బాటిళ్ల బాక్సులు జారి పడ్డాయి. లారీ డ్రైవర్ గమనించ కుండా ముందుకుపోవ డంతో శాసనాం గ్రామ సమీపంలో మరోసారి వైన్ బాటిళ్ల బాక్సులు పడిపోయాయి. దీంతో వీటి కోసం స్థానికులు ఎగబడ్డారు. మందుబాబులు ఆ బాటిల్స్ తీసుకుపోయి పండుగ చేసు కున్నారు. ఈ సమాచారం అందుకున్న నేషనల్ హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రోడ్డుపై ఉన్న గాజు పెంకులను తొలగించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రేపు జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు



**శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబర్ 25 (వార్త):** శ్రీకాకుళంలోని టౌన్‌హాల్ వేదికగా ఈనెల 27న జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలను నిర్వహించనున్నట్టు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా తెలిపారు. అండర్-17 బాలురు, బాలికల విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే బాల, బాలికలు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. పేర్లను నమోదు చేసుకున్న అభ్యర్థులు శుక్రవారం ఉదయం 8 గంటలకు టౌన్‌హాల్ వద్దకు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు జారీ చేసిన ఐడీ కార్డు ఫొటో స్టాట్ కాపీ, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్, ఫెన్సింగ్ ఎక్విప్‌మెంట్‌తో హాజరుకావాలని ఆయన సూచించారు. ఈ పోటీలకు జనవరి 1, 2008 నుంచి డిసెంబర్ 21,2011 మధ్య పుట్టినవారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.

ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఈనెల 28,29 తేదీల్లో కాకినాడలోని లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ నందు జరిగే అంతర జిల్లా ఫెన్సింగ్ చాంపియన్ షిప్‌కు ఎంపిక చేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఫెన్సింగ్ కోచ్ జోగిపాటి వంశీని.. 7660874844 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



**మందస, డిసెంబర్25 (వార్త):** మందస-హరిపురం రోడ్డులోని పితాతొళి జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఉద్యోగితో పాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మందసకు చెందిన కె.జోగారావు కొత్తపల్లి సచివాలయంలో జేఎల్‌ఎంగా పని చేస్తున్నారు. మందస గ్రామానికి చెందిన శిస్టు కిరణ్ కుమార్‌తో కలిసి హరిపురం నుంచి మందసకు బుధవారం రాత్రి వస్తుండగా పితాతొళి రోడ్డులోని చాకిరేవుగెడ్డ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులను 108 అంబులెన్స్లో హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వీరిలో జూనియర్ లైన్‌మేన్ జోగారావు పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ నీలకంఠం కేసు నమోదు చేశారు.

## నిబద్ధతతో పనిచేయాలి: ఎమ్మెల్యే కూన



**శ్రీకాకుళం, డిసెంబర్ 25 (వార్త):** జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు నిబద్ధతతో పని చేయాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచించారు. బుధవారం ఆయనను జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ ఎస్సీ/ఎస్టీ సభ్యులు బి.వి.ఎస్.ఎన్.రాజు, ధనుంజయరావు, తోట రాములు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు రవికుమార్‌ను పుష్పగుచ్ఛంతో సత్కరించారు. రవి కుమార్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ విధులు సమర్ధ వంతంగా నిర్వహించేందుకు కృషిచేస్తామన్నారు. జిల్లా వినియోగదారుల ఫోరం గౌరవ అధ్యక్షులు, బుడుమూరు శ్రీరామమూర్తి, బూర్జ వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.




## యువతకు ఉన్నత ఉద్యోగాలకు కృషి

**మందస, డిసెంబర్ 25 (వార్త):** విద్యార్థులకు భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగాలను కల్పించడానికి కృషి చేస్తున్నట్టు శ్రీ నాసా కంప్యూటర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ మడ్డు భీమారావు తెలిపారు. హరిపురంలోని ఆ ఇనిస్టిట్యూట్‌లో బుధవారం కోర్సు కంప్లీషన్ ఫర్ సర్టిఫికెట్‌కు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగాల్లో చేరేలా పి.జి. డి.సి.ఏ, డి.సి.ఎ, ఆఫీసు ఆటోమేషన్, ఎం.ఎస్.ఆఫీసు, సీ లాంగ్వేజ్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. జాబ్ క్యాలెండర్ అనుగుణంగా ఉచితంగా పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామన్నారు.కార్యక్రమంలో ఇన్‌చార్జి బూరగాపు దేవరాజు, స్టూడెంట్ కోఆర్డినేటర్ రేవతి, సీనియర్ ఫ్యాకల్టీ రేణుకా, జూనియర్ ఫ్యాకల్టీ ఓంకార్, పవన్, భవ్య తదితరులు పాల్గొన్నారు.

## సూక్ష్మ, చిన్న, కుటీర పరిశ్రమల స్థాపనపై శిక్షణ



**మందస, డిసెంబర్ 25 (వార్త):** విజన్-47లో భాగంలో గ్రామీణ మహిళలకు సూక్ష్మ, చిన్న, కుటీర పరిశ్రమల స్థాపనపై శిక్షణ ఇస్తున్నట్లు వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. సొండిపూడి, మూలిపాడు గ్రామాలకు చెందిన మహిళలను గుర్తించి, నాగావళి ఉచిత స్వయం ఉపాధి శిక్షణా సంస్థ సౌజన్యంతో మూడు రోజులుగా శిక్షణ ఇస్తున్నామన్నారు. వీరికి సర్టిఫికెట్లను అందజేయడంతో పాటు యూనియన్ బ్యాంకు ద్వారా స్వయం పరిశ్రమలు స్థాపనకు అవసరమైన పెట్టుబడి, మిషనరీల కొనుగోలు నిమిత్తం రుణ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. ఫ్యాకల్టీ లక్ష్మి మాట్లాడుతూ కొవ్వొత్తులు, డిటర్జెంట్ పౌడర్లు, శానిటేషన్, ఫినాయిల్ తయారీపై శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీవోఏలు కుసుమ, తులసి, క్లస్టర్ కోఆర్డినేటర్ తారకమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంటకు పొంచి ఉన్న ముప్పు



**వంగర, డిసెంబర్ 25 (వార్త):** ఎడతెరిపిలేకుండా ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సుమారు 100 ఎకరాల్లో మొక్కజొన్న పంటను నష్టపోయామని వంగర మండలం ఓని అగ్రహారం గ్రామ రైతులు తెలిపారు. పంట వేసిన వారం రోజుల తరువాత వర్షం కురిసి, పొలాలలో నీరు నిల్వ ఉండడంతో అవి చనిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఎకరానికి రూ.7000 వరకు పెట్టుబడి పెట్టా మని వాపోయారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి, తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎక్కడ చూసినా పొలాలు నీటితో నిండి ఉండడంతో పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి కనిపిస్తోంది.



# ఘనంగా వాజ్‌పేయి శత జయంతి వేడుకలు

**పలాస, డిసెంబర్ 25 (వార్త):** భారతరత్న ఆటల్ బిహారీ వాజపేయి శత జయంతి సందర్భంగా బుధవారం ఆయన విగ్రహానికి పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ భారతీయ జనతా పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు వైశ్యరాజు మోహన రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస వైకుంఠరావు మాట్లాడుతూ వాజ్‌పేయి గొప్ప రాజనీతిజ్ఞుడు, వ్యూహ కర్త అని కొనియాడారు. ప్రధానిగా ఆయన కిసాన్ క్రెడిట్ కార్డు పథకం, చక్కెర పరిశ్రమ, డైరీ పరిశ్రమ, అన్నపూర్ణ అన్నయోజన, మెట్రో నగరాలను కలుపుతూ స్వర్ణ చతుర్భుజి ప్రాజెక్టులతో విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వచ్చారన్నారు. ఆయన అడుగు జాడల్లో మోదీ ప్రభుత్వం నడుస్తోందన్నారు.

కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ, కన్వీనర్ తమ్మినాన మాధవరావు, కంచరాన భుజంగరావు, పట్టణ ప్రధాన కార్యదర్శులు హనుమంతు రామారావు, గొంటి అప్పారావు, జిల్లా సభ్యులు బూర్జపేట హరికృష్ణ, పొట్నూరు తారకేశ్వరరావు, నెమలపూరి అప్పారావు, బూత్ కమిటీల సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.





**మందస, డిసెంబర్ 25 (వార్త):** మందస మండలంలోని హరిపురంలో మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి జయంతి వేడుకలు జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. దేశానికి మంచి సేవలను ఆయన అందించారని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొంచాడ సురేష్‌కుమార్, ఉగ్రపల్లి మోహనరావు, ముదిమించి మధుబాబు, ఎస్ఆర్ఏ ఖాన్, నల్ల యోగి పాల్గొన్నారు.

**రణస్థలం, డిసెంబర్ 25 (వార్త):** దివంగత మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ వాజపేయి జయంతి సందర్భంగా రణస్థలంలోని క్యాంప్ కార్యాలయంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లింగాలవలస సర్పంచ్ లుకలాపు అప్పలనాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గొర్లె లక్ష్మణరావు, సాధు మల్లేశ్వరరావు, బీజేపీ నాయకులు గొర్లె శ్రీహరి, మీసాల గిరిబాబు, గోపిన కృష్ణారావు, నడుకుదిటి చినబాబు తదితరులు పాల్గొన్నారు.



# బాగింపేట రహదారిద్ర్యం..!

**-అడుగడుగునా గోతులు**

**-ప్రయాణికులకు నరకాన్ని తలపిస్తున్న వైనం**

**-పట్టించుకోని పాలకులు, అధికారులు**





**వంగర, డిసెంబర్ 25 (వార్త):** వంగర మండలంలోని బాగింపేట రోడ్డు పది గ్రామాల ప్రజలకు నరకాన్ని తలపింపజేస్తోంది. ఈ రోడ్డును కొన్నేళ్లుగా అధికారులు పట్టించుకోక పోవటంతో పెద్ద..పెద్ద గోతులమయమైంది. అరసాడ నుంచి బాగింపేట కు సుమారుగా 10 కిలోమీటర్ల గల ఈ రోడ్డులో అడుగుకొక గుంత.. గొయ్యి దర్శనమిస్తున్నాయి. వివిధ గ్రామస్థులు, వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణిస్తూ..నిత్యం ప్రమాదాల పాలవుతున్నారు. వంగర మండలానికి సంబంధించి నీలయ్యవలస, బాగింపేట, పటువర్ధనం, శ్రీహరిపురం, శ్రీహరిపురం ఆర్అండ్ఆర్ కాలనీ, కింజంగి ఆర్అండ్ఆర్ కాలనీలకు, రేగిడి మండలంలో కొండవలస, మన్యం జిల్లా బలిజిపేట మండలానికి చెందిన గేదెలపేటకు ఇదే ప్రధాన రహదారి. ఈ రోడ్డు మీదుగానే పదేళ్లుగా రాజాం నుంచి బాగింపేట వరకూ ఆర్టీసీ బస్సులు తిరుగుతుండేవి. కానీ రెండేళ్లుగా ఈ గుంతలతో నిలిపివేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఈ గుంతల్లోనే ప్రయాణిస్తూ నరకయాతన అనుభవిస్తున్నారు. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు.

ఇప్పటికైనా నిధులు సమకూర్చి, కొత్తగా రోడ్డును నిర్మించాలని వారు విన్నవిస్తున్నారు.

# శాంతినికేతన్‌లో గుడ్ గవర్నెన్స్ డే



**శ్రీకాకుళం, డిసెంబర్ 25 (వార్త):** భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం వారి ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాల లో బుధవారం గుడ్ గవర్నెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం అధికారి కె.వెంకట్‌ఉజ్వల్ మాట్లాడుతూ దేశ ఆర్థిక, సామాజిక వనరుల నిర్వహణలో అధికారాన్ని సక్రమంగా, సమర్థవంతంగా ఉపయోగించుకోవడం, పౌర కేంద్రీకృత పరిపాలన సుపరిపాలన పునాదిపై ఆధారపడి ఉంటుందన్నారు. సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు మాట్లాడుతూ పాలనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యాన్ని నిర్ధారించడం, పౌరులు తమ అభిప్రాయాలను చట్టబద్ధమైన సంస్థలు లేదా ప్రజాప్రతినిధుల ద్వారా వ్యక్తం చేసే అవకాశాన్ని పొందాలన్నారు. శాంతినికేతన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.అప్పలరాజు మాట్లాడుతూ కనీస వనరులు అందరికీ అందుబాటులో ఉండేలా ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకోవడం సుపరిపాలనలో భాగమన్నారు. కార్యక్రమంలో ఎస్.సత్యనారాయణ, నెహ్రూ యువ కేంద్ర వలంటీర్స్ అరుగుల దిలీప్‌కుమార్, మట్ట ప్రియాంక, గార మౌనిక పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## బాలుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**రాజాం, డిసెంబర్ 25 (వార్త):** రాజాంకు చెందిన ఇప్పిలి త్రిలోక్ అనే ఆరు నెలల బాలుడికి మంజూ రైన సీఎంఆర్ఎఫ్ చెక్కును శ్యాంపురంలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్.. ఆయన తండ్రికి అందజేశారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజారోగ్యం మీద దృష్టి సారించి పేద ప్రజా నీకానికి నాణ్యమైన వైద్య సేవలందించేందుకు పూనుకున్నారన్నారు. ప్రభుత్వం ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎంతో మంది పేద ప్రజానీకానికి ఆర్థికసాయం అందించి వారి పాలిట సంజీవనిగా నిలుస్తుందన్నారు.

# క్రీస్తు బోధనలు అనుసరణీయం

■ గ్రామగ్రామాన ఘనంగా క్రిస్మస్ వేడుకలు ■ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ■ ఉత్సాహంగా పాల్గొన్న క్రైస్తవ సోదరులు





### సర్వోన్నతుడు ఏసు..

**పలాస, డిసెంబర్ 25(వార్త):** సర్వోన్నతుడు ఏసుప్రభువు అని పలాస తహసీల్దార్ కళ్యాణ్‌చక్రవర్తి అన్నారు. పోత్రియ గ్రామంలో బుధవారం పాస్టర్ సవర జగన్నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఏసుప్రభువు ఆశీర్వాదాలతో అందరి జీవితాల్లో కష్టాలు తొలగి, సంతోషం, ఆరోగ్యం నింపాలని కోరుతున్నానన్నారు. పాస్టర్ జగన్నాయకులు మాట్లాడుతూ ప్రేమకు ప్రతి రూపం ఏసుక్రీస్తు అని, శాంతి, క్షమా గుణానికి ప్రేరణ ఆయన బోధనలు అన్నారు. క్రీస్తు సందేశం మానవాళికి ఆచరణాత్మకం అన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. అనంతరం క్రిస్టియన్ సోదరీమణులు చేసిన డ్యాన్స్ అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కగేశ్వరరావు, రామారావు, ఈశ్వరరావు, ఎస్.చంద్రశేఖర్, లోకేష్, సిద్ధు, కేశవరావు, కిరణ్, క్రాంతి, మాధవరావు, కృపావతి, ఎస్.ప్రవీణ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



**మందస, డిసెంబర్ 25 (వార్త):** క్రిస్మస్ వేడుకలను బుధవారం క్రైస్తవులు ఘనంగా జరినారు. మందసలోని అగాపే సంపూర్ణ సువార్త సంఘంలో జరిగిన వేడుకల్లో పాస్టర్లు డి.సత్యం, బి.శాంతారావు, ఆర్.యోహన్, ఆర్.కేశవరావు, ఎస్.లక్ష్మణరావు, బి.భాస్కరరావు మాట్లాడుతూ ప్రపంచానికి శాంతిదూత ఏసు ప్రభువన్నారు. క్రీస్తు లోక రక్షకుడన్నారు. లోకమంతా ప్రేమాభిమానాలు పంచడానికి ఏసు జన్మించడన్నారు. శాంతి సందేశం వినిపించేందుకు, మనుషుల మధ్య విబేధాలు రూపమాపడానికి భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు. అందరూ బాగుండాలని ప్రార్థనలు జరిపారు. కీర్తనలు ఆలపించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఏసు క్రీస్తు ప్రాధాన్యత తెలియజేస్తూ ప్రదర్శించిన నృత్య గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అగ్రహారం వీధిలో గల క్రీస్తేసుని ప్రార్థించే మందిరంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. పాస్టర్ పరిశుద్ధ పి.లూకా బైబిల్ సారాంశాన్ని వివరించారు. మానవత్వానికి ప్రతి రూపమే క్రీస్తు అన్నారు. ప్రపంచానికి దారి చూపేవాడు, దయామయుడు ఏసుక్రీస్తే అన్నారు. అనంతరం ఏసు నామ కీర్తనలను ఆలపించారు. కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని హరిపురం, గిరిజన ప్రాంతాలతో పాటు పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.



**శ్రీకాకుళం, డిసెంబర్ 25 (వార్త):** నగరంలోని పలు చర్చీల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో 31వ డివిజన్ ఇన్‌చార్జీ విభూది ప్రసాద్ పాల్గొన్నారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఫెయిత్ హెూం చర్చి అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జీసెస్ గాస్పల్ ట్రస్టు నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో డాక్టర్ గంజి ఎజ్రాతో పాటు పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు.





**రాజాం, డిసెంబర్ 25 (వార్త):** క్రిస్మస్ సందర్భంగా రాజాంలోని ఆర్సీఎం, సీబీఎం చర్చిల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎదుటి వారిపై ప్రేమ, దయ, క్షమాగుణాలు కలిగి ఉండాలనే క్రీస్తు సందేశాన్ని ప్రతి ఒక్కరూ అనసరించాలన్నారు. ఈ క్రిస్మస్ పండుగ ప్రతీ ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

**వంగర, డిసెంబర్ 25 (వార్త):** కొట్టిశ గ్రామంలోని సెవెన్ డేస్ చర్చ మందిరంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్‌ముఖర్జీ పాల్గొని, క్రైస్తవ సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. బంగారువలసలో పాస్టర్లు డేవిడ్, శివం, గారల అప్పలనాయుడు ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ ఘనంగా జరిగింది. క్రీస్తు పుట్టుక సర్వ మానమానవాళికి రక్షణ కలుగజేసిందని వారు బోధించారు. వంగరతో పాటు పలు గ్రామాల్లో క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరిపారు.



## సర్వ మానవాళికి శాంతి సందేశాన్నిచ్చిన యుగకర్త ఏసు

**పలాస, డిసెంబర్ 25 (వార్త):** ప్రేమ మార్గంలో ఎవరి మనసునైనా జయించవచ్చని ఏసుక్రీస్తు తన జీవితం ద్వారా నిరూపించారని కాశీబుగ్గ డీఎస్పీలు వెంకటప్పారావు, మూర్తి అన్నారు. పలాస గాయత్రినగర్‌లో గల జెరూసలేం హౌస్ ఆఫర్ షిఫ్ట్ చర్చి పాస్టర్ కె.జోసెఫ్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. క్రీస్తుమార్గంలో నడుస్తూ సాటి మనిషికి మేలుచేయడమే మన ముందున్న కర్తవ్యం అన్నారు. ప్రేమ, కరుణను అలవాటు చేసుకుందామని పిలుపునిచ్చారు. ఏసుక్రీస్తు ప్రేమ స్వరూపుడని తెలిపారు. సర్వ మానవాళికి శాంతి సందేశం ఇచ్చిన యువకర్త ఏసుక్రీస్తు జన్మదినం ప్రపంచానికే పండగని అన్నారు. క్రిస్టియన్ సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ఐ పీటర్, వజ్రపుకొత్తూరు ఎంపీడీవో రమేష్‌నాయుడు, పలాస ఎంపీడీవో వసంతకుమార్, వజ్రపుకొత్తూరు డీటీ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## వైసీపీ నేత రవికి మాతృవియోగం



**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 25 (వార్త):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మీడియా సెల్ ఇన్ చార్జి మండవిల్లి రవి మాతృమూర్తి మండవిల్లి మంగతాయారు బుధవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇతర నగర ప్రముఖులు , వ్యాపార, వాణిజ్యవేత్తలు అంతా కూడా ఆయన నివాసం వద్దకు చేరుకుని సంతాపాన్ని తెలియజేసారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆయన నివాసం వద్దకు చేరుకుని పార్థీవదేహం వద్ద నివాళులర్పించారు. మండవిల్లి రవి కుటుంబ సభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె పవిత్ర ఆత్మకి శాంతి చేకూరాలని ధర్మాన ప్రసాదరావు ఆకాంక్షించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546